# అతుకు

-గరిమెళ్ళ విశాలాక్షి

ఆసిల్‌మెట్ట బస్టాప్ చాలా రష్‌గా ఉంది. సమయం అయిదున్నర కావడంతో బస్టాప్ కిటకిటలాడుతోంది. సిటీబస్ ఆగీ ఆగడంతోనే ఎక్కేవాళ్లని నేర్పుగా తప్పించుకుంటూ ఒక చేత్తో తెగిపోయిన గొలుసు, మరోక చేత్తో ఒక వ్యక్తి కాలర్ పట్టుకుని బస్ దిగి ఈడ్చుకెడుతున్నట్లుగా పక్కకి తీసికెళ్లింది ప్రగతి.

"ఏరా రాస్కెల్ చూడడానికి చదువుకున్నవాడిలా ఉన్నావు. ఇలా దొంగతనాలు చేసుకునే ఖర్మ నీకేంటిరా? అయినా పరాయివాళ్ళ సొమ్ము, తేరగా వచ్చే సొమ్ము నీకు బాగా ఇష్టంలాగుంది" అంటూనే చెంప ఛెళ్ళుమనిపించింది.

చెంప పట్టుకుని అయోమయంగా ఆమె ముఖంలోకి చూస్తుండిపోయేడు అతను.

ఈ సంఘటన పలువురి దృష్టిని ఆకర్షించింది.

"ఏమిటేమిటి?"అంటూ ఆమె చుట్టూ చేరిపోయారు.

జనం బాగా చేరితే అతనికి బాగా దేహశుద్ధి చేస్తారని గ్రహించి అతని కాలర్ వదిలేసింది. 'వీడికీ గుణపాఠం చాలు' అనుకుంది.

వదిలిందే తడవు అతను జనంలో కలిసిపోయాడు.

చుట్టూ చేరిన వాళ్లతో రెండుముక్కలైపోయిన గొలుసు చూపించి బస్‌లో తన గొలుసు దొంగిలించబోయాడని తను వెంటనే చూసుకున్నానని చెప్పింది.

మంచి సంఘటన మిస్ అయినవాళ్లలా "ఎందుకమ్మా వాడ్ని వదిలేశావు. వెధవని బాగా తన్ని పోలీసులకి అప్పజెబుదుం కదా" అన్నాడు వాళ్లలో ఒక పెద్దాయన.

"ఎందుకు బాబాయ్‌గారూ! వాడికీ పాటికి బాగా బుద్ధి, సిగ్గు వచ్చి ఉంటాయి లెండి" అంది.

"అయినా బంగారం ధర పెరిగాకా చిన్నమెత్తు బంగారం అయినా ఒంటిని పెట్టుకుని తిరిగే రోజులు కావివి" అంది గుంపులో ఒకావిడ.

"అవునమ్మా" వంతపాడింది మరొకావిడ.

అందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్లిపోయారు.

చదువుకుంటున్న రోజుల్లో ఎప్పుడూ విజిల్ వేసేది ప్రగతి తల్లి 'మగరాయుడిలా ఏంటీ' అంటున్నా వినకుండా.

మళ్ళీ ఇన్నాళ్లకి వీడికి బుద్ధి చెప్పింది. మన సంతా ఆనందం నిండిపోగా విజిల్ మీద హమ్ చేయసాగింది.

మనసు నెలక్రితం జరిగిన సంఘటనల్ని నెమరువేసుకుంది.

★ ★ ★

తను డిగ్రీ సెకండియర్ చదువుతుండగా సరదాగా రాసిన కాంపిటేటివ్ ఎగ్జామ్‌లో సెలెక్ట్ అయింది.

తల్లి, తండ్రి, చెల్లి, శ్రేయోభిలాషులు అందరూ వచ్చిన ఉద్యోగం వదులుకోవద్దని సలహా ఇచ్చేరు.

తలకిందులుగా తపస్సు చేసినా ఉద్యోగాలు దొరకని ఈ రోజుల్లో అదృష్టదేవత అనుకోకుండా తలుపు తట్టింది.

ఉన్న ఊళ్ళోనే కలెక్టర్ ఆఫీసులో పోస్టింగ్ ఇచ్చారు.

దానితో తన పని మరీ సులువయ్యింది.

చదువు ప్రస్తుతానికి స్వస్తి చెప్పి ఆడుతూ, పాడుతూ ఉద్యోగానికెళ్ళేది.

ఇలా ఒక ఆరునెలలు జరిగాకా ఒకరోజు ఆఫీస్ నుండి వస్తున్న తనని ఇదే ఆసిల్‌మెట్ట బస్టాప్ దగ్గర అతను కలిశాడు.

★ ★ ★

"నమస్తే.. నా పేరు రమేష్. ఆంధ్రాబ్యాంక్‌లో పనిచేస్తున్నాను" అంటూ పరిచయం చేసుకున్నాడు.

'అయితే ఏంటీ?' అన్నట్లు అతని వైపు చూసింది ప్రగతి.

"నేను, మీరు గత ఆర్నెలలుగా ఒకే బస్‌లో వెళుతున్నాం. వచ్చేటప్పుడు ఇంచుమించుగా ఒకే బస్‌లో వస్తున్నాం. ఈ ఆరునెలలుగా మిమ్మల్ని గమనిస్తున్నాను. నాకు మీరు నచ్చారు. ఉద్యోగం చేస్తూ ఇప్పుడు ప్రేమ కబుర్లు చెప్పడానికి బాగుండదు. మీకు ఇష్టం అయితే మీ పెద్దవాళ్లని సంప్రదాయంగా కలుస్తాను" అంటూ తన మనసులో మాట బయటపెట్టాడు.

ఒక్కక్షణం ఉబ్బితబ్బిబ్బు అయింది. ఏం చెప్పాలో తోచలేదు.

"చూడండీ. నాకీ విషయాలు ఏమీ తెలియవు. మీరు మా పెద్దవాళ్లని కలవండి" అని చెప్పి వచ్చేసింది.

ఆ తర్వాత సంఘటనలు చకచకా జరిగిపోయాయి.

తల్లి,తండ్రి అప్పుడే పెళ్ళేంటి అనుకున్నారు ముందర. ఆ తర్వాత అనుకోకుండా వచ్చిన ఉద్యోగం లాగే ఇది అనుకున్నారు.

ఊళ్ళో మేనమామని పిలిచి సంప్రదింపులు జరిపి ఆడపిల్లకి పెళ్ళి ఎప్పటికైనా తప్పదు. పైగా కోరి వచ్చిన సంబంధం అని తీర్మానించి చివరికి తన ప్రమేయం లేకుండానే వాళ్లని పెళ్లిచూపులకి ఆహ్వానించేరు.

పెళ్ళిచూపులకి రమేష్ వాళ్ల తల్లితండ్రి, వాళ్ల అక్కా వచ్చేరు.

ఒక అరగంట దాకా దుర్మూహర్తం ఉండడంతో వాళ్ళని ఒక గదిలో కూర్చోపెట్టి కాఫీ, టిఫిన్ మర్యాదలన్నీ చేస్తున్నారు.

వాళ్ల గది తన గది పక్కనే ఉంది. అవతలగదిలో వాళ్లు నలుగురూ ఘర్షణ పడుతున్నట్లుగా

వాళ్ళు ఎంత నెమ్మదిగా మాట్లాడుకుంటున్నా కొన్ని మాటలు వినబడుతున్నాయి.

వాళ్ల గదికి, తన గదికి మధ్య వెంటిలేటర్ ఉంది. ప్రగతి కుతూహలం చంపుకోలేక తన గది తలుపు దగ్గరికి వేసి ఎత్తుగా ఉండే స్టూల్ వేసుకుని సభ్యత కాకపోయినా వాళ్ళ మాటలు వినడానికి ప్రయత్నించసాగింది.

రమేష్ అక్క అంటోంది.

"ఇల్లు చూస్తే అయ్యవారి నట్టిల్లులా ఉంది. బాగా కట్నకానుకలు ఇస్తారంటావా?" అనుమానంగా అడుగుతోంది.

"అక్కా నువ్వూరికే తొందరపడకు. నేనన్నీ ఆరాతీశాను. వాళ్ళు ఇద్దరే ఆడపిల్లలు. ఇంత మంచి సెంటర్‌లో ఇల్లు. ఇది కనీసం యాభైలక్షలు చేస్తుంది. వాళ్ల నాన్న గవర్నమెంట్ ఎంప్లాయి. ఇక ఆ అమ్మాయికి చిన్నవయసులో కలెక్టరాఫీస్‌లో ఉద్యోగం వచ్చింది. ఇప్పటిదాకా తెలియకపోయినా ఫర్వాలేదు. పెళ్లయ్యాకా నేను బాగా ట్రైనింగ్ ఇస్తాను కనీసం పై రాబడి ఐదొందలు ఉంటుంది. అందుకే ఈ పెళ్లి ప్రేమ, ఆదర్శం ముసుగు వేశాను. నువ్వు కట్న కానుకలు అంటూ గొడవచెయ్యకు" అంటున్నాడు రమేష్.

"అయితే నా ఆడపడుచు లాంఛనాలు పాతిక వేలు ఎవరిస్తారు?" గయ్యిమంది రమేష్ అక్క.

"నీకెందుకే ఆ ముసలాడి చేత నీకిప్పిస్తాను కదా!" అనునయంగా అన్నాడు.

"అబ్బాయి అత్తగారి లాంఛనాలు కూడా అడుగు" పక్కనుండీ తల్లి అందిస్తోంది.


వింటున్న ప్రగతి రక్తం సలసలా మరగసాగింది. గుండెల మీద చేయి వేసుకుంది. వీళ్లకింద ప్లానుందా? అనుకుంది.

'ముసలాడు' అని సంబోధించింది తన తండ్రినని గ్రహించగానే ఒంట్లోని రక్తం మరిగినట్లు అనిపించింది.

పెద్దవాళ్లనే కనీస మర్యాద లేకుండా అవమానపరిచే ఇలాంటివాళ్లను ఏం చేసినా పాపంలేదు. అందుకే వీళ్లకు తగిన బుద్ధి చెప్పాలనుకుంది. వాళ్లంతట వాళ్లే వెనక్కిపోయేలా చెయ్యాలని సంకల్పించింది.

పెళ్లిచూపుల్లో వంటొచ్చా? పాటలొచ్చా? సంగీతం నేర్చుకున్నావా? లాంటి చెత్త ప్రశ్నలన్నీ అయిపోయాకా రమేష్, వాళ్ళ అక్క ప్రగతికి చెరో ప్రక్కా కూర్చుని కుచ్చిళ్ళు తప్పించి పాదాలు, జడ ఎత్తి మెడ అన్నీ పరిశీలనగా చూశారు. వాళ్ల ప్రవర్తన ప్రగతికి తేళ్ళు, జెర్రెలు పాకినట్లు అనిపించింది.

ఇంత సంస్కారహీనంగా ప్రవర్తిస్తున్న వాళ్లను చూస్తుంటే అసహ్యామేసింది ప్రగతికి.



తన మనసులో మాట ఎలా బయటపెట్టడమా? అని ఆలోచిస్తుంటే 'కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు' రమేష్ లేచి మీరంతా అనుమతిస్తే నేను, ప్రగతి వంటరిగా మాట్లాడుకోవాలి అన్నాడు.

అమ్మానాన్న, మామయ్య. ఈరోజుల్లో ఇవన్నీ మామూలే అనుకున్నారు.

ప్రగతి ఇంటి వీధి చివరే ఆసిల్‌మెట్ట బస్టాప్. నడుచుకుంటూ బస్టాప్‌కి వచ్చారు.

ఎంత నయవంచన? మంచివాడిలా ఎంతగా నాటకమాడాడు? ఇంకా నయం వాళ్ల మాటలు తను వినబట్టి ఈ మహానుభావుడి అసలు స్వరూపం తెలిసింది. తను అనుకున్నది చెప్పడానికి ఇదే సరైన అదును అనుకుంది.

"చూడండి రమేష్ గారూ మీకు నేను అన్నివిధాలుగా నచ్చినట్లేనా?" అని అడిగింది.

"ఏం అలా అడుగుతున్నారు?" అని అడిగాడు రమేష్ నవ్వుతూ.

"అబ్బే మరేం లేదు. మా వాళ్ళు మీరు ఎంత కట్నం ఆశిస్తే అంత కట్నం, లాంఛనాలు అన్నీ ఇస్తారు" అంటూ ఆగి అన్నాడు కులాసాగా నవ్వుతూ.

"మరేం లేదు. పెళ్ళవగానే నేను ఉద్యోగం మానేద్దాం అనుకుంటున్నాను" అంది నెమ్మదిగా ప్రగతి.

"అదేం" అన్నాడు బాంబు పడినట్లుగా.

"నేను మొదటే అనుకున్నాను. నేనీ ఉద్యోగం చెయ్యకూడదు అని. కానీ మా అమ్మానాన్నగారు పెళ్లి కుదిరేదాకా చెయ్యమ్మా. ఆతర్వాత నీకిష్టం లేక పోతే మానేద్దువుగాని అన్నారు. సరే కాస్త నాకు టైం పాస్‌గా ఉంటుందని చేస్తున్నాను. రేపు పెళ్లయ్యాకా ఎలా కుదురుతుందండీ. నాకు తెలిసిన ఎంతో మంది పెళ్ళయ్యాకా ఉద్యోగాలు చేస్తూ రెండూ చెయ్యలేక సతమతమవుతున్నారు. అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను. పెళ్ళయ్యాక ఉద్యోగం మానేద్దామని. అయినా మీరు నన్ను చూసి చేసుకుంటున్నారు కానీ నా ఉద్యోగం చూసి కాదుగా" అంది చిన్నగా నవ్వుతూ ప్రగతి.

రమేష్ బలవంతంగా నవ్వుతూ "అవునవును" అన్నాడు.

అన్నాడే కానీ అతని ముఖంలో తీవ్రమయిన ఆశాభంగం కలిగింది. మరొక మాట అంది ప్రగతి.

"చెప్పండి" అన్నాడు, చేదు మింగినట్లుగా ఉంది రమేష్ పరిస్థితి. వంటరిగా మాట్లాడే నెపంతో భవిష్యత్ గురించి ప్రణాళికలు ఆమెకి వివరిద్దాం, కట్న కానుకలు రూపేణా పుట్టింటి నుండీ ఆమెద్వారా రాబడదాం అని ఎన్నో ప్లాన్స్ వేసుకున్నాడు.

అతని ఆలోచనలు పురిట్లోనే సంధికొచ్చాయి.

"ఏం లేదు. ఇప్పుడు మేం ఉంటున్న ఇల్లు మా తల్లిదండ్రులు వాళ్ల తదనంతరం రామకృష్ణమఠానికి రాసేశారు. నాకూ మా చెల్లి కూడా అలా జరగడమే ఇష్టం. సో...మీరు నన్ను పెళ్లి చేసుకోవాలంటే మీ వాళ్లు అడిగిన కట్నం, లాంఛనాలు అన్నీ మావాళ్ళు ఇస్తారు. మీకు ఇష్టమే కదా" అంది ప్రగతి.

అతని ముఖంలో క్షణక్షణానికీ మారిపోతున్న రంగులు చూసి మనసులో నవ్వుకుంది.

"అవన్నీ పెద్దవాళ్ళు చూసుకుంటారు. మనకెందుకు చెప్పండి. పదండి పోదాం వాళ్ళు చూస్తూ ఉంటారు" అన్నాడు రమేష్.

★ ★ ★

ఆ తర్వాత వారంరోజులకి జాతకాలు కలవలేదనే వంకతో సంబంధం వదులుకుంటున్నట్లు తెలియజేశారు.

ప్రగతి తల్లిదండ్రులు మాత్రం అంతలా వెంటపడ్డారు చేసుకుంటాం? అని అవాక్కయ్యారు.

ఉండబట్టలేక ప్రగతి తను విన్నదంతా చెప్పింది. తను చేసిన పని కూడా చెప్పింది.

"పోనీలేమ్మా. ఈ సంబంధం తప్పిపోవడమే మంచిది. మేం వాళ్ల మాయలో పడిపోదుము" అంది తల్లి.

★ ★ ★

ఆలోచనలలోనే ఇల్లు చేరింది ప్రగతి.

కూతురి చేతిలో గొలుసు చూసి "ఏమ్మా ఎలా తెగిపోయింది" ఆదుర్దాగా అడిగింది ప్రగతి వాళ్లమ్మ.

"లంచ్ అవర్లో బేసిన్ కుళాయికి తగిలి తెగిపోయింది అమ్మా. రేపు వీలైతే షాప్‌కి తీసుకెళ్లి అతుకు పెట్టిస్తావా?" అంది ప్రగతి.

"అతుకులవి వేసుకునే ఖర్మ నీకెందుకే. కొత్త మోడల్ గొలుసు ఇది మార్చేసి కాస్త ఖరీదు ఎక్కువైనా మంచిది రేపే తెస్తాను" అంది.

"థ్యాంక్స్ అమ్మా" అంటూ తల్లి బుగ్గ మీద ముద్దుపెట్టింది ప్రగతి. ★

## టీవీ పిచ్చిలో అగ్రరాజ్యం

ఒక సర్వే ప్రకారం అమెరికాలో 1975లో యాభైఏడు శాతం ఇళ్లల్లో ఒక్క టీవీ ఉండేదిట. ఇప్పుడు అమెరికన్ ఇళ్లల్లో మనుష్యులకన్నా టీవీలు ఎక్కువగా ఉన్నాయిట. న్యూయార్క్‌లో డేవిడ్ లియాన్ ఇంట్లో అతనికి, భార్యకి, అతని నాల్గేళ్ల కవలపిల్లలకి విడివిడిగా వాళ్ల బెడ్రూమ్‌ల్లో, డ్రాయింగ్‌రూముల్లో, కిచెన్‌లోను చివరికి బాత్రూంలో కూడా టీవీలున్నాయిట. ఎనిమిదవది ఎక్కడ పెట్టాలో ఆలోచిస్తున్నారట. ఇన్ని టీవీలెందుకంటే గది గదికీ ఇంట్లో తిరిగి పనులు చేసుకుంటూ ప్రోగ్రామ్‌లు చూడడానికట. దీన్నిబట్టి ప్రతి ఇంట్లో ప్రతి టీవీ ఎనిమిదిగంటలపైన ఆన్‌లో ఉంటుందిట. సరాసరి రోజూ ప్రతి మనిషీ నాలుగైదు గంటలు తక్కువకాకుండా టీవీ చూస్తాడట. పాపం మన దేశంలో అంతకు రెట్టింపు టైం టీవీ చూసే జనాలున్నారని వాళ్లకి తెలియదు.

## ప్రాణాలు తీసిన కొకైన్

కార్డిఫ్ నుంచి ఇంగ్లండ్‌కు ప్రయాణం చేస్తున్న నలభై ఏళ్ళ నికోలా జేమ్‌లాస్ట్ అనే మహిళ చిన్న చిన్న కొకైన్ డ్రగ్ పేకెట్లు తన కడుపులో దాచుకుని అక్రమ రవాణా చేస్తున్నట్లు అనుమానం వచ్చింది. తనిఖీ చేస్తే కొకైన్ వల్ల ఆమె అనారోగ్యంపాలైందని తేలింది. చివరికి ఆ డ్రగ్స్ పేకెట్లలో కొన్ని పగిలి ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

-విమలారామం

